బీమాపై సడలుతున్న ధీమా

బీమా అంటేనే రక్షణ. కష్టకాలంలో ఆదుకుంటుందనే నమ్మకం. కానీ ఈ నమ్మకాన్ని వమ్ము చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నదాతలు మండిపడుతున్నారు. పంటల బీమాపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు .

- పంటల బీమాపై స్పష్టత రాష్ట్ర ప్రభుత్వం
- ఉచిత పంటల బీమా అమలయ్యేనా..?
- ఆందోళన చెందుతున్న రైతులు

కాశినాయన : ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే. చీడపీడలు, నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాలు, అతివృష్టి, అనావృష్టి రైతన్నకు అవరోధాలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో పంటలు నష్టపోతే ఆయా సీజన్లలో పంట నష్టపరిహారం అందేది. గత ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా స్థానంలో రైతులకు మరింత ప్రయోజనం కలిగించేలా మెరుగైన పథకాన్ని తెస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో కమిటీ వేయడంతో పాటు నెల రోజుల్లో సదరు కమిటీ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కేబినేట్ తీర్మానించడంతో రైతుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కమిటీ నెల రోజుల్లో నివేదిక ఇచ్చినా ఉత్తర్వులు ఇచ్చి కార్యాచరణలోకి రావాలంటే మరింత సమయం పడుతుంది. ఉచిత పంటల బీమా అమలు చేస్తుందా లేక మళ్లీ 2019కి ముందు పరిస్థితులే వస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జాప్యం ఎందుకు..?

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల కారణంగా పంటలు నాశనమై రైతు నష్టపోయేవాడు. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యకు పాల్పడిన సందర్భాలను 2019కు ముందు వరకు చూశాం. ఇలాంటి విపత్తుల నుంచి అన్నదాతను ఆదుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం తీసుకువచ్చింది. ప్రతి ఏడాది పంట వేసినప్పుడే ఇ–క్రాప్ బుకింగ్ చేసి రైతు నష్టపోకుండా జగన్ సర్కారు అండగా నిలిచింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి 65 రోజులు దాటింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కొంత మంది రైతులు నాట్లు వేయడంతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ కూడా ముగిసింది. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించకపోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు పరిహారం పొందే అవకాశం కోల్పోతారు. అయితే సాధారణంగా రెన్యువల్ సమయంలోనే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ రెన్యువల్ ముగిసిన తర్వాత కూడా పంటల బీమాపై మంత్రులతో త్రిసభ్య కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుంది. 2024–25 సంవత్సరానికి సంబంధించి విధి విధానాలను కూటమి ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.



అకాలవర్షానికి దెబ్బతిన్న వరిపంట (ఫైల్)

రైతులపై భారం పడకూడదని..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేసింది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం కూడా ఉచితంగా పథకం అమలు చేస్తుందా ... లేదంటే 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో ఎకరాకు రూ.525 చొప్పున ప్రీమియం వసూలు చేస్తుందా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరితో పాటు బీమా కింద వేరుశెనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటాకు వాతావరణ బీమా, పసల్‌బీమా కింద కంది, వరి, మొక్కజొన్న, ఉచిత బీమా కింద ఆముదం, రాగి పంటలకు వర్తింపజేశారు. కూటమి ప్రభుత్వం ఏయే పంటలకు బీమా వర్తింపజేస్తుందో ప్రకటించాల్సి ఉంది.

నియోజకవర్గంలో వివరాలు

నియోజకవర్గంలోని కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు, గోపవరం మండలాల్లో దాదాపు 75 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అయితే ఖరీఫ్‌లో 18 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ఇ–క్రాప్ ఉచిత బీమా కోసం ఎదురుచూస్తున్నారు.

బీమాపై స్పష్టత ఇవ్వాలి



వ్యవసాయ భూమిపై బ్యాంకులో తీసుకున్న రుణానికి ఇటీవలే వడ్డీ కట్టి రెన్యువల్ చేశాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేను తీసుకున్న నాలుగు ఎకరాల భూమికి ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. ఈ ఏడాది కూడా బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తే బాగుంటుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

–జి.నారాయణ, రైతు, కె.ఎస్.కొట్టాల, కాశినాయన మండలం

ప్రభుత్వమే చెల్లించాలి



నేను మూడు ఎకరాల్లో అరటిపంటను సాగు చేశాను. గతేడాది పంటల బీమా ప్రీమియం గత ప్రభుత్వమే చెల్లించింది. ప్రస్తుత ప్రభుత్వం పంటల బీమా ఎవరు చెల్లించాలనే దానిపై స్పష్టత ఇవ్వలేవు. ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి. ప్రభుత్వం ఆదుకోవాలి. షరతులు లేకుండా బీమాను అమలు చేయాలి.

– డి.చెంచయ్య, రైతుల, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

మార్గదర్శకాలు రాలేదు



పంటల బీమాపై ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతం ఇ–క్రాప్ మాత్రమే చేయమన్నారు. ప్రభు త్వం నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.

–ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి, కాశినాయన మండలం

క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9–30 గంటల నుంచి మధ్యాహ్నం 1–30 గంటల వరకు ప్రజావేదిక (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే 9–30 గంటల నుంచి 10–30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని, నేరుగా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమస్యలను తెలియజేయవచ్చన్నారు. 08562–244437 నంబర్‌కు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్ చేయవచ్చని తెలిపారు.

రేపటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్‌బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు చెబుతారని, భక్తులు, ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

కాజ్‌వే నిర్మించండి..!



గాదెగూడూరు నుంచి కూలూరు రహదారిలో హైలెవెల్ కాజ్‌వే నిర్మించాల్సిన ప్రాంతం

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు నుంచి కూలూరు, కొట్టాల గ్రామాలకు వెళ్లే రహదారిలో హైలెవెల్ కాజ్‌వేను నిర్మించాలని వాహనదారులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు, కుందూ నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు నీరంతా రోడ్డుపై 3 నుంచి 4 అడుగుల ఎత్తు మేర ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ సమస్యను సంబంధిత శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హైలెవెల్ కాజ్‌వే నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్య శిబిరం విజయవంతం



తొండలదిన్నెలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె గ్రామంలో ఆదివారం ప్రొద్దుటూరుకు హారిక ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు ఎం.రమేష్, ఎం.నాగయ్య రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎముకలు, కీళ్ల సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. షుగర్, బీపీ, ఆయాసం, పక్షవాతం, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు తదితర జబ్బులకు వైద్య చికిత్సలు తీసుకోవాలని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకుడు సుధీకర్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నారుమడిని చెడగొట్టారని పోలీసులకు ఫిర్యాదు

చాపాడు: మండల పరిధిలోని మొర్రాయిపల్లె గ్రామానికి చెందిన ఎర్రగుడి జయలక్ష్మి అనే మహిళ వరి సాగు కోసం సిద్ధం చేసుకుంటున్న నారుమడిని గ్రామానికి చెందిన చీపాటి సుబ్బారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ప్రభావతమ్మ చెడగొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2023 మే 5న భూమిని కొనుగోలు చేసి రిజిష్టర్ చేయించుకున్నానని, అప్పటి నుంచి తన ఆధీనంలో పొలం ఉందని, ఈ ఏడాది వరి సాగు చేసుకునేందుకు నారుమడిని సిద్ధం చేసుకున్నానని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి హక్కు లేపోయినా తన నారుమడిని ధ్వంసం చేశారని వాపోయారు.

మారెమ్మకు విశేష పూజలు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లె కందిపాలెంలోని గ్రామ దేవత శ్రీ జగన్మాత మారెమ్మ తల్లీ ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల కుటుంబ సభ్యులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి తొలి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, న్యాయవాది సట్టి భారవి ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన భక్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన పలువురు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాలతో బోనాలు సమర్పించి.. చల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. అందులోని చల్లను అమ్మవారికి సమర్పించారు. నిర్వాహకులు దాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు. వార్షికోత్సవంలో వేలాది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవం



వజ్రకిరీటం, వజ్రపు చీరెలో వాసవీమాత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామున సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించి మంగళహారతి ఇచ్చారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిగా హోమద్రవ్యాలను సమర్పించారు. అమ్మవారిని వజ్రకిరీటం, వజ్రపు చీరెలో అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

ఖాజీపేట : ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని, వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. మాల, మాదిగల ఐక్యతను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఐకమత్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలని కోరారు.

దినదినాభివృద్ధి చెందుతున్న పోరుమామిళ్ల



షోరూమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల దినదినాభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. పట్టణంలోని బద్వేలు రోడ్డులో ఆదివారం సింగం ఫ్యాషన్స్ షో రూమ్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. షోరూమ్ యజమానులు మల్లేశ్వర్‌రెడ్డి, నాగేందర్ రెడ్డి ఈ షోరూమ్ పోరుమామిళ్లలో 11వ బ్రాంచిగా ఏర్పాటు చేశారని తెలిపారు. షోరూమ్ ప్రారంభానికి ప్రముఖ సినీ నటి హెబ్బాపటేల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కల్లూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, కలసపాడు జెడ్పీటీసీ అంకన గురివిరెడ్డి, వైఎస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈ నెల 12 నుంచి 14వరకూ మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రహమతుల్లయ్య తెలిపారు. ఏపీ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పంచాయతీ అభివృద్ధి, పంచాయతీ అవార్డులపై ప్రతి రోజూ ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ తప్పనిసరిగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

బ్రహ్మంగారిమఠం: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి బుధవారం వరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల పరిషత్ సభాభవనంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని, శిక్షణకు వచ్చేవారు తప్పకుండా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విజేతలతో డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో సరస్వతి విద్యాపీఠం అనంతపురం సమితి స్థాయి ఖేల్‌కూద్ ముగింపు కార్యక్రమానికి ఉప విద్యాశాఖాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు చాలా అవసరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. నిత్యం క్రీడా సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హైజంప్, పరుగు తదితర పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం అనంతపురం సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నేత్రవైద్యుడు స్వరూప్ కుమార్‌రెడ్డి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు బుశెట్టి రాజశేఖర్, నిర్వహణ కమిటీ ప్రతినిధులు యల్లారెడ్డి, కేశవరెడ్డి, కాశీప్రసాద్‌రెడ్డి, రామచంద్రయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కలసపాడు : బాల్యమిత్రులంతా సరిగ్గా 49 ఏళ్ల కిందట ఏడో తరగతి కలసి చదువుకున్నారు. ఉన్నత చదువులు అభ్యసించారు, కొందరు ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఇంకొద్దరు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. సంసారజీవితంలో ఏళ్లు గడిచిపోయాయి. అలాంటి వారందరూ చదువులమ్మబడికి ఆదివారం మళ్లీ చేరారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో 1975–76 విద్యాసంవత్సరంలో 7వ తరగతి అభ్యసించారు. పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనము నిర్వహించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, జోజి, నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 49 ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థులందరూ ఒకచోటికి చేరి ఆనందం పంచుకున్నారు. ఆత్మీయ పలకరింపుతో సందడి చేశారు. విద్యాబుద్ధులు చెప్పిన అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల మొదటి గురువు దివంగత అన్నాపాపయ్య వద్ద విద్యాభ్యాసం చేసిన ప్రతిఒక్కరు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డామని గుర్తుచేసుకున్నారు. గురువులకు, ఫాదర్‌ను సన్మానించారు. అందరూ కలిసి విందు భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫాదర్ రెవ. బాలస్వామి, మరియరాణి, విజయప్రభావతి, జాకోబ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీపీఎస్‌లో చెస్ అండర్–13 పోటీలు



చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం అండర్–13 కడప జిల్లా చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఐడీపీఎస్‌కు చెందిన అభిరామన్ ప్రథమ స్థానంలో జి.ప్రణవ్ రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇదే క్రమంలో బాలికల విభాగంలో కటారి జ్యోత్స్న ప్రథమ, జి.తేజోమయి ద్వితీయ స్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్–9 విభాగంలో పి.రామ్ రీధాన్స్, వెంకట సుశాంత్, జి.మోక్షిత్‌రెడ్డి, అండర్–11లో ఎన్.రితిక్ యాదవ్, సి.హనీష్, టి.హేతవ్, ధాత్రి, అండర్–7లో ఎంపీఎస్ కుశాంక్, అండర్–11 బాలికల విభాగంలో కె.హర్షిత వివిధ కేటగిరీలలో పథకాలు సాధించారు. జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు రామ్ సుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ ఇమామ్ హుస్సేన్, చీఫ్ ఆర్బిటర్ జిలాన్, ఆర్బిటర్‌గా ఇంటర్నేషన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా చెస్ పోటీలు నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులకు అడ్డుకట్ట వేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ్ శేఖర్ కోరారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఆయన ఆదివారం కలిసి అంబేడ్కర్ చిత్రపటం బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల దళిత వర్గాలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్, రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, కడప నగర అధ్యక్షుడు చెంచుల డేవిడ్ సత్యారాజ్, జమ్మలమడుగు తాలూకా యూత్ అధ్యక్షులు జె.దీపక్, పోతు బోయిన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● చినుకులతో చిగురించిన ఆశ

మూడు రోజులుగా కురుస్తున్న చినుకులు రైతుల్లో ఆశలు చిగురింపజేశాయి. మెట్ట పంటలకు ఈ వర్షం ఊపిరిపోసింది. ఈ వర్షాలకు పలు గ్రామాల్లోని రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఎద్దులు, ట్రాక్టర్లతో పత్తిసాళ్లను తోలుకుంటూ కూలీలతో నాటిస్తున్నారు. ధరలు అంతంత మాత్రంగానే ఉండటం, ఖర్చు ఎక్కువవడంతో చాలామంది రైతులు ఆసక్తి చూపడం లేదని వారు అంటున్నారు. గత ఇరవై రోజుల క్రితం నాటిన పత్తి మొక్కలకు పదునైన వర్షం పడటంతో ఏపుగా పెరిగాయి. అయితే ధరలు, దిగుబడి బాగా రావాలని కోటి ఆశలతో పత్తి పంటను సాగు చేస్తున్నట్లు కర్షకులు చెబుతున్నారు. –రాజుపాళెం



ముందస్తుగా సాగు చేసిన పత్తి పంట



పత్తి విత్తనాలు



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

అనాథ పిల్లల మధ్య రాజారెడ్డి వర్ధంతి



రాజారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న అనాథ పిల్లలు, సంస్థ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : రాజాఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజారెడ్డి ప్రథమ వర్ధంతిని ఆదివారం అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. ప్రొద్దుటూరులోని పూజా స్కూల్‌తో పాటు మైలవరంలోని డాడీహోంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో అనాథ పిల్లలు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాఫౌండేషన్ మాజీ చైర్మన్ రాధా, మాజీ సీఈఓ కవిత మాట్లాడుతూ డాడీ మరణం తమను శాశ్వతంగా అనాథలను చేసి చీకట్లోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. డాడీ హోం అనే ఆలయంలో ఎందరో అనాథలు, అభాగ్యులకు నిలువ నీడ, పట్టెడు అన్నం దొరుకుతోందని చెప్పారు. అనాథ పిల్లలతో పాటు సంస్థ సిబ్బంది రాజారెడ్డిని స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం రాజారెడ్డి జ్ఞాపకార్థం పూజా ఇంటర్నేషనల్ స్కూల్ మెమోరియల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. అనాథల కోసం రాజారెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



బద్వేలు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగభూషణ్



ఎస్‌ఐగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న కె.సి.రాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ వినోద్‌కుమార్

బద్వేలు (అట్లూరు): శాంతి భద్రతల పరిరక్షణ ప్రాధాన్యం ఇస్తామని బద్వేలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషన్ తెలిపారు. బద్వేలు రూరల్ సర్కిల్ సీఐగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసిన విక్రమసింహా బదిలీపై వెళ్లడంతో నంద్యాల జిల్లా ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నాగభూషన్‌ను ఇక్కడి బదిలీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ

బ్రహ్మంగారిమఠం: బి.మఠం ఎస్‌ఐగా చంద్రశేఖర్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. చంద్రశేఖర్ తలమంచిపట్నం నుంచి బి.మఠంకు బదిలీపై వచ్చారు. బి.మఠం ఎస్‌ఐగా పనిచేస్తున్న విద్యాసాగర్ కొండాపురంనకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూస్తానని తెలిపారు.

బి.కోడూరు ఎస్‌ఐగా కె.సి.రాజు

బి.కోడూరు : బి.కోడూరు మండల ఎస్‌ఐగా కె.సి.రాజు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అట్లూరు ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై బి.కోడూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలతో సత్సంబంధాలను కలిగి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

దువ్వూరు : దువ్వూరు మండల పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఎస్.వినోద్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వినోద్‌కుమార్ చక్రాయపేట ఎస్‌ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్‌ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు క్రైం : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్‌ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. రూరల్ ఎస్‌ఐగా ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటి నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు.

వన్‌టౌన్ ఎస్‌ఐగా శ్రీనివాసులు

ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్‌ఐగా ఎస్ శ్రీనివాసులు బాధ్యతలు తీసుకున్నారు. దువ్వూరులో పని చేస్తూ బదిలీపై ఆయన వన్‌టౌన్‌కు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ మంజునాథ్ వీఎన్‌పల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.